## క్లుప్తంగా

### స్థానిక ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి

మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్



మాట్లాడుతున్న కేఎల్లార్

**తుక్కుగూడ:** త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేసేందుకు నేతలు సిద్ధంగా ఉండాలని మాజీ ఎమ్మెల్యే, మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కేఎల్లార్ సూచించారు. సోమవారం తుక్కుగూడ మున్సిపాలిటీలోని ఆ పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 15 వరకు నోటిఫికేషన్ వస్తే సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీగా పోటీచేసే వారు తగు ప్రణాళికలను తయారు చేసుకోవాలన్నారు. పార్టీ శ్రేణులు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. సమావేశంలో నాయకులు దేప భాస్కర్‌రెడ్డి, నందిగామ నర్సింహ, యూసూఫ్‌ఖాద్రీ, ఆలే కుమార్, జ్ఞానేశ్వర్, వెంకటేశ్, రవికుమార్, భాస్కర్, ఫజిల్ ఖాద్రీ తదితరులు పాల్గొన్నారు.

### ఓటర్ జాబితాపై రాజకీయ పార్టీలతో సమావేశం నేడు

**కందుకూరు:** రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు గ్రామ పంచాయతీల్లో సప్లిమెంటరీ ఓటరు జాబితా తయారు చేశామని, ఆ లిస్టులో అభ్యంతరాలపై మంగళవారం మధ్యాహ్నం వివిధ పార్టీల నాయకులతో సమావేశం ఏర్పాటు చేస్తున్నామని ఎంపీడీఓ సరిత సోమవారం తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు రాజకీయ పార్టీల నాయకులు హాజరై ఓటరు లిస్టుపై అభ్యంతరాలను తెలియజేయాలని ఆమె కోరారు.

### కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం



కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మతో నిరసన తెలుపుతున్న నాయకులు

**కందుకూరు:** కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ కార్పొరేట్లకు పెద్దపీట వేసి పేదలను ఇంకా పేదలుగా మార్చేలా ఉందని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు డి.రాంచందర్ పేర్కొన్నారు. సోమవారం సీపీఎం మండల కార్యదర్శి బుట్టి బాల్‌రాజ్ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఆదాని, అంబానీ లాంటి బడా పెట్టుబడిదారులకు లాభం చేకూర్చేలా బడ్జెట్ ప్రవేశపెట్టారన్నారు. రైతులకు బడ్జెట్‌లో ఎలాంటి కేటాయింపులు చేయలేదని, ఉపాధి కూలీలకు పని దినాలు పెంచకపోగా ఉన్న పనిదినాలు తగ్గించేలా బడ్జెట్ ఉందన్నారు. కార్మికులకు ఉద్యోగ భద్రత లేదన్నారు. ఎన్నికలు జరిగే రాష్ట్రాలకే కేటాయింపులు అధికంగా చేపట్టారని, తెలంగాణకు మొండి చేయి చూపారని మండిపడ్డారు. ఈ బడ్జెట్‌ను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యులు గౌర శ్రీశైలం, నాయకులు మంజయ్య, గుడిసెల సంఘం అధ్యక్షుడు గాదె శేఖర్, సత్యం, సంచల, అరుణ, జంగమ్మ, మహేందర్, అజీజ్ తదితరులు పాల్గొన్నారు.

### ఇళ్ల స్థలాలు చూపాలంటూ వినతి



ఆర్డీఓకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు, లబ్ధిదారులు

**కందుకూరు:** పేదలకు ఇచ్చిన సర్టిఫికెట్లకు సంబంధించి ఇళ్ల స్థలాలు చూపించాలని కోరుతూ సీపీఎం పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో లబ్ధిదారులు సోమవారం ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు డి.రాంచందర్, మండల కార్యదర్శి బుట్టి బాల్‌రాజ్ మాట్లాడుతూ.. 16 ఏళ్ల క్రితం కందుకూరు సర్వే నంబర్ 788లో 183 మందికి 60 గజాల చొప్పున ఇళ్ల స్థలాల కోసం పట్టా సర్టిఫికెట్లు ఇచ్చారని, గత ఏడాది కొత్తగా సర్వే నంబర్ 107లో 330 మందికి సర్టిఫికెట్లు అధికారులు ఇచ్చారన్నారు. అప్పటి మంత్రి సబితారెడ్డి లేఅవుట్ వేసి అందరికీ ఇళ్ల స్థలాలు ఇస్తామని హామీ ఇచ్చారని, ఇంతవరకు స్థలాలు కేటాయించలేదన్నారు. త్వరగా సమస్య పరిష్కరించాలని ఆర్డీఓను కోరామన్నారు. దీనిపై స్పందించిన ఆయన త్వరలో సర్వే చేయించి సమస్యకు పరిష్కారం చూపుతానని తెలిపారన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు శ్రీశైలం, సిద్దం అంజయ్య, సీఐటీయూ నాయకులు గాదె సత్తయ్య, శేఖర్, సంచల, అరుణ, రాధా, రాజమణి, నజియాబేగం, జంగమ్మ, ఇందిరమ్మ, మహేందర్ పాల్గొన్నారు.

# విద్యుత్ అస్తవ్యస్తం ప్రమాదాలు నిత్యకృత్యం!

జల్‌పల్లి మున్సిపాలిటీలో పేరుకుపోయిన కరెంటు సమస్యలు
- ప్రాణాలు పోతున్నా పట్టించుకోని అధికారులు
- ఆందోళనలో స్థానిక ప్రజలు



ఎర్రకుంటలో పిట్టగూళ్లను తలపిస్తున్న విద్యుత్ స్తంభం



వాదే-సాల్హే-హీన్ బస్తీలో ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్

**పహాడీషరీఫ్:** జల్‌పల్లి మున్సిపాలిటీలో నెలకొన్న విద్యుత్ సమస్యలతో ఎప్పుడు ఏం జరుగుతుందోనని స్థానిక ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ వైర్లు, టీవీ కేబుల్స్ ఒకే స్తంభానికి పిట్టగూళ్లను తలపించేలా కలిసి ఉండడం.. చిన్నారులు అందుకునే ఎత్తులో ట్రాన్స్‌ఫార్మర్లు.. ఇళ్ల బాల్కానీల పక్క నుంచే చేతికందే దూరంలో కరెంటు తీగలు ఉండటంతో ఇక్కడ ప్రమాదాలు నిత్యకృత్యంగా మారాయి. గత నెల షాహీన్‌నగర్ ప్రధాన రహదారిపై నిర్మాణంలో ఉన్న ఇంటి బాల్కనీలో పీఓపీ పనులు చేస్తుండగా ఓ కార్మికుడు పట్టుతప్పి వైర్లపై పడి, అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. స్తంభాలు ఒకదానికొకటి దూరంగా ఉంటుండడంతో తీగలు సాగి వేలాడుతున్నాయి. చిన్నపాటి గాలులకే తెగిపోతున్నాయి. ప్రతినెలా క్రమం తప్పకుండా బిల్లులు చెల్లిస్తున్నా, సంబంధిత అధికారులు మాత్రం ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టడం లేదని మండిపడుతున్నారు.

**దశాబ్దం కావొస్తున్నా..**

జల్‌పల్లి, పహాడీషరీఫ్, బాలాపూర్, కొత్తపేట నాలుగు గ్రామ పంచాయతీలతో కలిపి 2016లో జల్‌పల్లి మున్సిపాలిటీ ఏర్పడింది. దాదాపు దశాబ్దం కావొస్తున్నా ఇక్కడి విద్యుత్ వ్యవస్థలో మార్పులు రావడం లేదు. పంచాయతీగా ఉన్న సమయంలో ఆవాసాలు తక్కువగా ఉండటంతో ఇందుకు తగ్గట్టుగా విద్యుత్ సరఫరా వ్యవస్థను ఏర్పాటు చేశారు. కానీ ప్రస్తుతం ఇళ్లతో పాటు జనాభా భారీగా పెరిగింది. దీనికి అనుగుణంగా విద్యుత్ వ్యవస్థలో మార్పులు చేయట్లేదు. ఉన్న దాంట్లోనే సర్దుబాటు చేస్తుండటంతో తరచూ సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. ఒకే స్తంభానికి రెండు వరుసల్లో వైర్లు తీసుకెళ్తుండడం, సింగిల్ స్తంభానికి కాసారాలు ఏర్పాటు చేసి ట్రాన్స్‌ఫార్మర్లు బిగిస్తుండటం పరిపాటిగా మారింది.

**తరచూ కోత.. తీరని వ్యథ**

మున్సిపల్ పరిధిలో వారానికి మూడు నాలుగు రోజులు చెట్ల కొమ్మల కత్తిరింపు, ఇతర మరమ్మతుల పేరిట అధికారికంగా విద్యుత్ కోత విధిస్తున్నారు. పనుల అనంతరమైనా నాణ్యమైన కరెంటు సరఫరా చేయడంలో అధికారులు విఫలమవుతున్నారు. షాహీన్‌నగర్ సమీపంలోని క్యూబా కాలనీలో విద్యుత్ కోతలపై స్థానిక ప్రజలు మండిపడుతున్నారు. కరెంటు ఎప్పుడు వస్తుందో.. ఎప్పుడు పోతుందో తెలియని దుస్థితి నెలకొందని చెబుతున్నారు.

**ప్రాణాలు పోతున్నా..**

అల్జైన్ కాలనీలో ఇళ్లను ఆనుకొని ఉన్న విద్యుత్ వైర్ల కారణంగా ఇప్పటివరకు ముగ్గురు మృతి చెందారు. 2014లో కాలనీకి చెందిన రిజ్వానా బేగం ఇంట్లో అద్దెకు ఉన్న ఓ 18 ఏళ్ల యువతి బాల్కనీలో దుస్తులు ఆరేస్తూ పక్కనే ఉన్న విద్యుత్ వైర్లకు తగిలి షాక్‌కు గురైంది. ఆమెను రక్షించేందుకు వెళ్లిన 30 ఏళ్ల సోదరుడు కూడా విద్యుదాఘాతానికి గురయ్యాడు. అంతకుముందు ఇదే కాలనీలో నూతన ఇంటి పనులు చేస్తున్న మేస్త్రీ బాల్కనీలోని వైర్లకు తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు.

**అధికారులు స్పందించాలి**



ఎన్నో ఏళ్ల క్రితం వేసిన లైన్లనే ఇప్పటికీ కొనసాగిస్తున్నారు. స్తంభాల నడుమ కూడా దూరం పెరిగి తీగలు ఇళ్లపై వేలాడుతున్నాయి. ఈ విషయంలో అధికారులు స్పందించి కొత్త లైన్లు వేయడంతో పాటు స్తంభాల సంఖ్యను కూడా పెంచాలి. చిన్న పిల్లలు ప్రమాదాల బారిన పడకుండా ట్రాన్స్‌ఫార్మర్లకు దిమ్మెలు కట్టాలి.

– షర్ఫుద్దీన్ హామెద్, షాహీన్‌నగర్



పహాడీషరీఫ్: చిన్నారులకు అక్షరాభ్యాసం చేయిస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

## ఘనంగా వసంత పంచమి

**పహాడీషరీఫ్:** వసంత పంచమి సందర్భంగా జల్‌పల్లి మున్సిపాలిటీ శ్రీరాం కాలనీలోని హర్ష పాఠశాలలో సోమవారం మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించి ఆశీర్వదించారు. అనంతరం ఆమె సరస్వతీ దేవికి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ ఉప్పెమూరి నిరంజన్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

**తుక్కుగూడలో..**

**తుక్కుగూడ:** మున్సిపాలిటీ కేంద్రంలో శ్లోక ఇంటర్నేషనల్ స్కూల్‌లో వసంత పంచమి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలల్లో రుద్ర సహిత నవ చండీ యాగం నిర్వహించారు. చిన్నారులకు శ్రీ రేణుకా రాజరాజేశ్వరి పీఠాధిపతి నవీన్‌శర్మ చిన్నారులకు అక్షరాభ్యాస్యం చేయించారు. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి పి.సబితాఇంద్రారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యా. కార్యక్రమంలో ఆ పాఠశాల మేనేజింగ్ డైరెక్టర్ చింతల సంగమేశ్వర్ గుప్తా, చైర్మన్ బిట్ల శ్రీనివాస్‌రెడ్డి, చింతల మనీష్‌గుప్తా, ప్రిన్స్‌పాల్ సుమోన్‌సింగ్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## కేఎల్ఆర్‌పై దురుసుగా మాట్లాడటం సరికాదు



మాట్లాడుతున్న నాయకులు

**బడంగ్‌పేట్:** కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డిపై దురుసుగా మాట్లాడటం ఎమ్మెల్యే సబితారెడ్డికి తగదని బడంగ్‌పేట కంటెస్టెడ్ కార్పొరేటర్, 24వ డివిజన్ ఇన్‌చార్జి నవారు మల్లారెడ్డి అన్నారు. సోమవారం అల్మాస్‌గూడలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గౌరవ మాజీ ఎమ్మెల్యేను విమర్శించే హక్కు ఎమ్మెల్యేకు లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.ఎవరు నిధులు తెచ్చినా డివిజన్ల అభివృద్ధికే అనే సంగతి మరిచి ఆమె మాట్లాడుతున్నారని విమర్శించారు. జీవోల పేరుతో కాలనీవాసులను మోసం చేశారన్నారు. ఐదు సంవత్సరాలు మంత్రిగా ఉండి ఎంత అభివృద్ధి చేశారో శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు.చెరువుల కబ్జాలు, అనుచరుల అవినీతి బాగోతాలు అందరికీ తెలిసినవేనన్నారు.అవినీతి పాలనను చూసి ప్రజలకు విసుగొచ్చి కాంగ్రెస్ పార్టీని ఎన్నుకున్నారన్నారు. కార్యక్రమంలో గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ డైరెక్టర్ బోయపల్లి గోవర్ధన్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, వేణుగోపాల్ తదితరులు ఉన్నారు.

## అభివృద్ధిలో కేంద్ర నిధులే కీలకం

మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం



సీసీరోడ్డు పనులను ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే, నాయకులు

**చేవెళ్ల:** గ్రామాల అభివృద్ధిలో కేంద్రం అందించే నిధులే కీలకంగా ఉన్నాయని చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం అన్నారు. చేవెళ్ల మండలంలోని మల్కాపూర్ గ్రామంలో సోమవారం ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి సహకారంతో వచ్చిన ఎంపీ లాడ్స్ నిధులు రూ.5లక్షలతో చేపట్టనున్న సీసీరోడ్డు పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అందించే నిధులతోనే ఇప్పుడు రాష్ట్రంలోని గ్రామాల అభివృద్ధి జరుగుతుందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వంలో ఖజానా లేక ఇచ్చిన హామీలను అమలు చేయటంలో పూర్తిగా విఫలమైందని, ప్రజలు ఈ ప్రభుత్వాన్ని నమ్మే పరిస్థితి లేదన్నారు. పీఎం మోదీ అందిస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలే దేశ వ్యాప్తంగా ప్రజలకు అందుతున్నాయన్నారు. ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి తన ఎంపీ లాడ్స్ నిధుల నుంచి గ్రామాల అభివృద్ధికి సంబంధించి నిధులు కేటాయించారని, ఈ నిధులతో గ్రామాల్లో జోరుగా పనులు జరుగుతున్నాయన్నారు. ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు బీజేపీ నాయకులు, కార్యకర్తలు అండగా ఉంటారని చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ప్రభాకర్‌రెడ్డి, అంజనేయులుగౌడ్, సామ మాణిక్యరెడ్డి, వెంకట్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షులు అనంత్‌రెడ్డి, డాక్టర్ వైభవ్ రెడ్డి, దేవుని శర్వలింగం, ఇంద్రసేనారెడ్డి, కృష్ణగౌడ్, ఎ.శ్రీనివాస్, మల్లేశ్, జైపాల్‌గౌడ్, శివ, మాజీ ఎంపీటీసీ రవీందర్‌రెడ్డి, గ్రామ నాయకులు యాదిరెడ్డి, మాధవ్‌రెడ్డి, మాణిక్యరెడ్డి, ఝాఫర్, నరేందర్‌గౌడ్, మోసిన్, ఉమ్మర్ తదితరులు ఉన్నారు.

## గ్రామాల అభివృద్ధే లక్ష్యం



మాట్లాడుతున్న నాయకులు

బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జగదీశ్వర్

**కేశంపేట:** గ్రామాల్లో మౌలిక వసతులతో పాటు అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జగదీశ్వర్ అన్నారు. మండల పరిధిలోని కొత్తపేట గ్రామంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గూడ వీరేశ్ ఆధ్వర్యంలో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జగదీశ్వర్ మాట్లాడుతూ..గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో గ్రామాల అభివృద్ధి కుంటుపడిందని విమర్శించారు.బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లలో చేసిన అభివృద్ధి శూన్యమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన 13 నెలల్లోనే ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సహకారంతో గ్రామాల్లో అభివృద్ధి పనులకు సుమారు 7కోట్ల నిధులను మంజూరు చేయించారన్నారు. గ్రామాల్లో అండర్ డ్రైనేజీ, సీసీ రోడ్లు, కమ్యూనిటీ హాళ్ల నిర్మాణాలకు ఈ నిధులను మంజూరు చేయించారని, త్వరలోనే పనులను ప్రారంభిస్తామని ఆయన తెలిపారు. రానున్న నాలుగేళ్లలోగా గ్రామాలు అభివృద్ధి పథంలో కొనసాగుతాయని హామీనిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సబ్బండ వర్గాలకు న్యాయం జరు గుతుందని తెలిపారు. రాష్ట్రంలో ప్రజాపాలన కొనసాగుతుందని,ప్రజలందరికీ సంక్షేమ పథకాలు అందుతాయని ఆయన తెలిపారు. మండల అభివృద్ధికి కృషి చేస్తున్న ఎమ్మెల్యే శంకర్‌కు మండల నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రమేశ్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు భాస్కర్, సురేశ్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, గిరియాదవ్, పెంటయ్య, సురేష్, గోపాల్, రాములు, భీమయ్య, రూప్లా నాయక్, హరీశ్వర్ రెడ్డి, మనోహర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## దేవాలయాల అభివృద్ధికి కృషి

ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌రెడ్డి, కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి

**షాబాద్:** దేవాలయాల అభివృద్ధికి తమవంతు కృషి చేస్తామని ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌రెడ్డి, కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని మాచన్‌పల్లి గ్రామంలో గల నల్లచెరువు కట్ట మైసమ్మ దేవాలయ ప్రారంభోత్సవ కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి పూజలు చేసి ప్రసాదాలు స్వీకరించారు. అతి పురాతనమైన ఆలయ పునర్నిర్మాణానికి రూ.50 లక్షలు అందించిన దాత నేరట్ల పరిపూర్ణ మహేందర్‌గౌడ్ కుటుంబ సభ్యులను వారు అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. శిథిలావస్థలో ఉన్న ఆలయాలను అభివృద్ధి చేసుకొని, ధూప, దీప నైవేద్యాలను కొనసాగిండం మంచి పరిణామన్నారు. అదేవిధంగా జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి ఆయా కార్యక్రమాల్లో పాల్గొని అమ్మవారికి పూజలు చేశారు. ప్రతి ఒక్కరూ దైవచింతన అలవర్చుకోవాలని, కొంత సమయం దేవునికి కేటాయించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో పీసీసీ రాష్ట్ర కార్యదర్శి ఎస్.రాంరెడ్డి, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కావలి చంద్రశేఖర్, వెంకటయ్య, సత్యనారాయణరెడ్డి, విక్రంరెడ్డి, నర్సింలు, పాండు, మాజీ సర్పంచ్‌లు శ్రీనివాస్‌గౌడ్, లింగం, ఖాజామీయా, నాయకులు తదితరులు ఉన్నారు.

# మూలనపడ్డ ట్రాక్టర్

- అవగాహన లోపంతో నీరుగారుతున్న సర్కారు లక్ష్యం
- అప్పుల ఊబిలో మండల మహిళా సమాఖ్య



కొందుర్గు మండల సమాఖ్య ఎదుట వృథాగా ఉన్న ట్రాక్టర్

**కొందుర్గు:** ప్రభుత్వం మంచి లక్ష్యంతో తలపెట్టిన పథకం అవగాహన లోపంతో నీరుగారుతోంది. ముందుచూపు లేకపోవడంతో పొదుపు చేసిన డబ్బులు ఖాస్తా అప్పు తీర్చడానికి సరిపోతున్నాయని కొందుర్గు మండల మహిళా సమాఖ్య సభ్యులు వాపోతున్నారు. వ్యవసాయాధారిత మండలమైన కొందుర్గు మండల మహిళా సమాఖ్యకు ట్రాక్టర్ ఇవ్వడంతో అటు రైతులకు ఉపయోగపడటంతో పాటు, ఇటూ మండల సమాఖ్యకు ఆదాయం సమకూరుతుందనే ఆలోచనతో 2022 ఏప్రిల్‌లో రూ. 9,12,296 ఖర్చుచేసి ట్రాక్టర్ మంజూరు చేసింది. అలాగే ట్రాక్టర్‌కు సంబంధించిన రూటోవేటర్, కల్టివేటర్, కరిగెట్ చేసే వీల్స్ అందించారు. అదేవిధంగా మరో రూ.2లక్షల విలువైన ట్రాక్టర్ ట్రాలీని అప్పటి కలెక్టర్ సమాఖ్యకు ఉచితంగా అందజేశారు. మొత్తం ట్రాక్టర్ యూనిట్‌కు సంబంధించి రూ. 8,97,300లు స్త్రీనిధి రుణం అందించగా, రూ. 3,45000లు రాయితీ ఉంటుంది. దీనికిగాను రూ.1,38,225లు మండల మహిళా సమాఖ్య వాటా ఖర్చు చేసింది. ఇంతవరకు బాగానే ఉంది. కానీ ట్రాక్టర్‌కు డ్రైవర్‌ను కూడా నియమించకపోవడం, కొందుర్గు మండలంలో దాదాపు అన్ని గ్రామాల్లో ట్రాక్టర్లు అధికంగా ఉండటంతో సర్కారు లక్ష్యం నీరుగారుతోంది.

**వినియోగంలో లేకపోవడంతో..**

రైతులెవరూ ట్రాక్టర్‌ను వినియోగించుకోకపోవడంతో ప్రస్తుతం ట్రాక్టర్ మహిళా సమాఖ్య భవనం ఎదుట వృథాగా పడి ఉంది. ట్రాక్టర్ పనిచేయడం లేదు. ట్రాక్టర్‌కు సంబంధించిన వాయిదాలు కట్టడానికి ఇబ్బందిగా మారిందరి సమాఖ్య సభ్యులు ఆరోపిస్తున్నారు. సమాఖ్యలో తాము పొదుపు చేసిన డబ్బులు వాయిదాల కోసం కట్ చేసుకుంటున్నారని వాపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

**విస్తృతంగా ప్రచారం చేశాం**



మండల సమాఖ్యలో ట్రాక్టర్ ఉందని, నెలకు రూ.22వేలు ఇచ్చి తీసుకెళ్లాలని రైతులకు విస్తృతంగా ప్రచారం చేశాం. అయినా రైతులు ట్రాక్టర్ తీసుకెళ్లడానికి ఆసక్తి చూపడం లేదు. ట్రాక్టర్‌ను వృథాగా పెట్టి వాయిదాలు చెల్లించాల్సి వస్తోంది.

–జయమాలిని, ఏపీఎం, కొందుర్గు

**ట్రాక్టర్లు అధికంగా ఉండడంతోనే..**



గ్రామాల్లో ట్రాక్టర్లు అధికంగా ఉండటంతోనే రైతులు తీసుకెళ్లడానికి ఆసక్తి చూపడం లేదు. ప్రస్తుతం పంటలపై మందులు పిచికారీ చేసే డ్రోన్ యంత్రంపై చాలా డిమాండ్ ఉంది. మండలంలో ఎక్కడ ఈ యంత్రం లేదు. అది ఇచ్చినా బాగుండేది.

–సంగీత, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు

### నేడు రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం

**కొందుర్గు:** త్వరలో జరగనున్న స్థానిక ఎన్నికల నేపథ్యంలో మంగళవారం ఉదయం 11 గంటలకు రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహిస్తున్నట్లు కొందుర్గు, జిల్లేడ్ చౌదరిగూడ ఎంపీడీఓలు లక్ష్మీఅనురాధ, ప్రవీన్‌కుమార్ వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. ఈ సమావేశానికి అన్ని పార్టీల నాయకులు హాజరై తమ అభిప్రాయాలను తెలపాలని సూచించారు.

### 'లక్ష డప్పుల'ను విజయవంతం చేయండి

**షాద్‌నగర్:** హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో ఈ నెల 7 నిర్వహించే లక్ష డప్పులు–వేల గొంతులు మహాప్రదర్శనను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు కోరారు. సోమవారం పట్టణంలోని పెన్షనర్ల భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పలువురు నాయకులు మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ అమలుతోనే భావితరాలకు న్యాయం చేకూరుతుందన్నారు. స్వాతంత్ర్యం సిద్ధించిన నాటి నుంచి నేటి వరకు అన్ని ప్రభుత్వాలు మాదిగలకు అన్యాయం చేశాయని ఆరోపించారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ అమలుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఎల్బీ స్టేడియంలో ఏర్పాటు చేయనున్న బహిరంగ సభకు మాదిగలు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

## తాగు సమస్యలు రాకుండా చర్యలు

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

**షాద్‌నగర్:** వేసవిలో తాగునీటి సమస్యలు రాకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సూచించారు. సోమవారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో మిషన్ భగీరథ అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రానున్న వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని అధికారులు గ్రామాలు, పట్టణంలో మంచినీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. పైప్‌లైన్లు, వాల్స్ లీకేజీలను గుర్తించి వెంటనే మరమ్మతులు చేపట్టాలన్నారు. బైరంపల్లి గ్రిడ్ పరిధిలో నీటి సరఫరా పంపులు తరచూ పాడవుతుండటంతో చాలా గ్రామాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, సమస్య పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా వడ్డెవాడ గ్రామానికి మిషన్ భగీరథ పైప్‌లైన్ ఎందుకు వేయలేదని, 22 కుటుంబాలు నివాసం ఉంటున్న చిన్న గ్రామానికి పైప్‌లైన్ వేయడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదన్నారు. వెంటనే పైప్‌లైన్ వేసి నీటిని సరఫరా చేయాలని సూచించారు. అదేవిధంగా రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకొని అధికారులు యాక్షన్ ప్లాన్‌ను సిద్ధం చేయాలని సూచించారు. మంచినీటి సమస్యలు గుర్తించి వెంటనే పరిష్కరించేందుకు అధికారులు తగిన చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో ఈఈ నాగేశ్వర్, డీఈఈలు సందీప్, అబ్దుల్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్‌ఖాన్, నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, కృష్ణారెడ్డి, పురుషోత్తంరెడ్డి, రాజు, పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే